క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజవొమ్మంగి: జంగిల్ క్లియరెన్స్, ట్రీ కట్టింగ్ పనుల్లో భాగంగా శుక్రవారం 11కేవీ జడ్డంగి ఫీడర్‌పై విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ స్థానిక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌కుమార్ గురువారం తెలిపారు. మండలంలోని లబ్బర్తి, కింద్ర పరిసర ప్రాంతాల్లోని 14 గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన

మారేడుమిల్లి: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం రంపచోడవరం, మారేడుమిల్లిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రంపచోడరం ఎంపీడీవో కార్యాలయం వద్ద రైతులకు ట్రాక్టర్ల పంపిణీ, అనంతరం 11.30 గంటలకు మారేడుమిల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లకు సన్మానం, మధ్యాహ్నం మూడు గంటల నుంచి మారేడుమిల్లి పంచాయతీ పరిధిలో పూజరిపాకలు, మూసూరు, కూడూరు, మద్దలూరు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్‌ను పరామర్శించిన జెడ్పీటీసీ



రాజులమ్మతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ

కొయ్యూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మను జెడ్పీటీసీ వారా నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గత నెల 30న కత్తిరాలలొద్దిలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అక్కడ నుంచి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వర్షానికి మట్టిలో బైక్ స్కిడ్ అయింది. దీంతో పడిపోయారు. ఆమెతోపాటు ఏఎంసీ సభ్యుడు అచ్యుత్‌కు గాయాలైన విషయం తెలిసిందే.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



జోడుమామిడి గ్రామస్తులను సన్మానిస్తున్న మల్లేశ్, తదితరులు

కొయ్యూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకంటే ఆరోగ్యంగా ఉంటామని అల్లూరి గిరిజన సేవా సంఘం నేత టి. మల్లేశ్ సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గురువారం డౌనూరు పంచాయతీ జోడుమామిడిలో గిరిజనులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నిల్వ ఉంచిన పదార్థాలను తినొద్దని ఆయన సూచించారు. తాజాగా ఉన్నవాటిని తినాలని కోరారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ నుంచి గ్రామస్తులను సన్మానించారు. వారికి పలు సూచనలు చేశారు. మండల బూత్ కమిటీ కన్వీనర్ పొట్టిక పోతురాజు, స్థానిక నాయకులు పి. గాంధీ, యువకులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సీదరి సొంబ

హుకుంపేట: ప్రభుత్వం 90 శాతం రాయితీతో గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేయడంతో ఎంతో మేలు కలుగుతుందని మట్టుజోరు సర్పంచ్ సీదరి సొంబ తెలిపారు. గురువారం మండలంలోని మట్టుజోరు రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులకు ఆయన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్బీకేల్లో ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మద్దివీధిలో లబ్ధిదారునికి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న పాలనా సంస్కరణ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ఏఎస్సార్ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో నుర్మతి గ్రామ సచివాలయ పరిధి మద్దివీధి, ఇసుకగరువు, చెరువీధి, నక్కమెట్ట, ధనుడుకొండ, తోకగరువు, కొర్రుబయలు గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజనుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఆమె ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి జగన్ పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల్లో 145 గడపలను సందర్శించారు. ప్రభుత్వ పాలన, నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలపై వివరించారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు పొందిన అర్హులు ఉంటే గ్రామ సచివాలయాన్ని సంప్రదించి వాటిని పొందాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందటంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకునే భాగ్యం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించగా ఆర్థికపరమైన సమస్యలను కలెక్టర్‌కు రిప్రజెంటేషన్ రాస్తున్నట్టుగా ఆమె చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజాప్రతినిధులు నేరుగా తమకు ఓటు వేసిన ప్రజల దగ్గరకు వెళ్లి సమస్యలు తెలుసుకోవటం దేశ చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నుర్మని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొంబాబు, సీదరి కొండబాబు, గంగరాజు, మండల సచివాలయ కన్వీనర్ కళ్యాణం, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణ్, బొంజునాయుడు, బాలన్న, శ్రీను, సోంబాబు, వరలక్ష్మి, కాంతమ్మ, భీమరాజు, చిరంజీవి, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గృహసారథులు దేవి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పంచముఖి ఆంజనేయస్వామి వార్షికోత్సవం



పంచముఖి ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల: మండలంలోని గాంధీనగరం సమీపాన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు భీమునిపట్నం సద్గురు సేవాశ్రమం, గాంధీనగరం హనుమ సేవాశ్రమం సాయిరాం స్వామిజీ తెలిపారు. ఇక్కడ ఆలయంలో 108 కలశాలతో జలాధివాసం పంచామృతాభిషేకాలు, అఖండ జ్యోతి ప్రజ్వలన, సహస్ర నామా పూజలు సర్వకార్యసిద్ధి సకల దేవతా హోమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులతో సామూహిక హనుమ నామ పఠనం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. శనివారం పాలకపాటి గురుదేవుల ఆశ్రమం రామానందస్వామిజీ, గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు ఎం మత్స్యరాజు, నీలకంఠం అధ్వర్యంలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ భజన బృందాలతో భక్తి గీతాలు, ఆదివారం కోలాటాలు, థింసా నృత్యాలు, భజనలు, రామనామ సంకీర్తనలతో పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన (స్వామివారి ప్రసాదాల వితరణ) ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు మత్స్యపురంలో 'గడపగడపకు'

హుకుంపేట: మండలంలోని మారుమూల మత్స్యపురం పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం తెలిపారు. పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తామన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు ఉదయం 7గంటలకు హాజరు కావాలన్నారు.

వైఎస్సార్ బీమాతో ఆర్థిక భరోసా



బీమా సొమ్ము అందిస్తున్న నాయకులు, సచివాలయ సిబ్బంది

ముంచంగిపుట్టు: వైఎస్సార్ బీమాతో బాధిత కుటుంబాలకు కొండంత ఆర్థిక భరోసా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ తెలిపారు. దారెల పంచాయతీ గన్నేడ గ్రామంలో గత నెల 19న పార్వతి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు సర్పంచ్, నాయకులు, సచివాలయ సిబ్బంది గురువారం అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు నామినీ బ్యాంక్ ఖాతాలో జమవుతాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి కలుగుతుందన్నారు.

నెయ్యిల సంఘం నేత శ్రీను మృతికి సంతాపం



సింగిడి శ్రీను(ఫైల్)



సింగిడి శ్రీను మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు

సాక్షి,పాడేరు: నెయ్యిల సేవా సంఘం అధ్యక్షుడు సింగిడి శ్రీను(44) మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనారోగ్య సమస్యలతో గురువారం తెల్లవారుజామున నోటి నుంచి రక్తస్రావం కావడంతో హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. వర్తక సంఘంతోపాటు నెయ్యిల సేవా సంఘం అధ్యక్షుడిగా శ్రీను విశేష సేవలు అందిస్తున్నాడు. ఆయన మరణంతో పాడేరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉదయం నుంచి వర్తక సంఘం నేతలు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శ్రీను మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధ్యాహ్నం అశేష జనవాహిని మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. వర్తక సంఘం నేతలు కొట్టగుళ్లి సుబ్బారావు, అనిల్, బూరెడ్డి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వర్తకులు పాల్గొన్నారు.

లక్కపాడుకు తీరిన తాగునీటి సమస్య

5 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లోని ప్రభుత్వ నిధులతో చేపడుతున్న తాగునీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జీవీఎస్ ప్రకాష్ తెలిపారు. మండలంలో వంతాల పంచాయతీ మారుమూల గ్రామం లక్కపాడుకు కనీస రోడ్డు సదుపాయం లేకపోవటంతో డీఈ గురువారం కాలినడకన ఐదు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కి, దిగి, గెడ్డలు దాటి వెళ్లారు. అక్కడ ప్రజల తాగునీటి కోసం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.7.5 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఐదు వేల లీటర్ల నీటి ట్యాంక్, ఇంటింటికీ ఏర్పాటు చేసిన 40 కుళాయిలను ప్రారంభించారు. కుళాయిల పనితీరును డీఈ పరిశీలించారు. గ్రామంలో ఎన్నోయేళ్ల నుంచి ఎదుర్కొంటున్న నీటి కష్టాలు నేటి గ్రావిటీ పథకం నిర్మాణంతో తీరాయని గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుస్ ఏఈ విజయ్‌కుమార్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెండు పీజీటీ పోస్టుల భర్తీ

అడ్డతీగల: బాలికా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలో ప్రారంభించిన మహిళా జూనియర్ కళాశాలలకు పీజీటీ టీచర్లను నియమిస్తున్నట్టు ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. అందులో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్ట్‌లకు గాను ఇద్దరు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లను నియమించారన్నారు. మిగతా సబ్జెక్ట్‌ల విద్యా బోధనకు అనువుగా నియామకాలకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. ఇక్కడ గత విద్యా సంవత్సరంలో ప్లస్ టు జూనియర్ కళాశాల ప్రారంభించారు. 15 మంది బాలికలు బైపీసీ గ్రూపులో ప్రవేశాలు పొందారు. ఉత్తీర్ణత శాతం అతి తక్కువగా నమోదైనప్పటికీ అధ్యాపకుల నియామకాలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులనే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లుగా కళాశాలల్లో విద్యా బోధనకు పదోన్నతి ఇచ్చి నియమిస్తోంది.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- జిల్లా సరిహద్దులో రాత్రి పూట గుట్టుగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



రాత్రి పూట ఇసుకతో నింపి తరలిస్తున్న ట్రాక్టర్లు



రోలుగుంట : పగలయితే అధికారులు దాడులుంటాయని.. రాత్రిపూట గుట్టుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల సరిహద్దులో రోలుగుంట మండలం శివారు ఎం.కె.పట్నం పంచాయితీ శివారు పెదపేట రెవెన్యూలో ప్రభుత్వం చెడ్డవాగు పెదసాకిరేవు నుంచి రావణాపల్లి అవకు ప్రవహిస్తున్న గెడ్డ ఇసుక తవ్వకాలకు అడ్డాగా మారింది. ఒకప్పుడు ఒకే జిల్లాలో గల కొయ్యూరు, రోలుగుంట మండలాలు నేడు జిల్లాల విభజనలో అల్లూరి, అనకాపల్లి జిల్లాలుగా మారి ఇది సరిహద్దుగా ఉండడంతో ఇసుకాసురులకు ఇది వరంగా మారింది. చీకటి వ్యాపారం చేసుకుంటూ ట్రాక్టరు లోడు రూ.8వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తవ్వకాలు ఇలానే కొనసాగితే గెడ్డలోతు పెరిగి వర్షాకాలంలో నీటి ప్రవాహానికి తమ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దు కావడంతో రెవెన్యూ అధికారులు తమ పరిధి కాదని తప్పించుకుంటున్నారని ఈ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రెవెన్యూ వీఆర్వో పి.రాజులమ్మ వివరణ కోరగా తాను ఈ ప్రాంతంలో రెండు దఫాలు తనిఖీ చేశానని, ఈ విషయం ఉన్నతాధికారులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

'పది' సప్లిమెంటరీకి సిద్ధం

గంగవరం: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నుంచి స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన 115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ

మునగపాక : రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తున్నామని మైక్రో ఇరిగేషన్ ఓఎస్‌డీ (టెక్నికల్) వై.వెంకటేశ్వర్లు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆయన మండలంలోని నాగవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. డ్రిప్‌కు సంబంధించి 5 ఎకరాలలోపు రైతులకు 90 శాతం రాయితీ, 5 నుంచి 12.50 ఎకరాల లోపు రైతులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. స్ప్రింక్లర్ల విషయానికి వస్తే 5 ఎకరాల లోపు రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాలు దాటిన రైతులకు 45 శాతం రాయితీ అందజేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు వన్‌బీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబరుతో రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నీటిలో కరిగే ఎరువుల ఉపయోగంపై అవగాహన కల్పించారు.

బైక్ స్కిడ్ అయినట్టు నటించి...

సాక్షి, అనకాపల్లి : మొబైల్ దొంగలు ఇప్పుడు కొత్త పంథాలో చోరీలకు పాల్పడుతున్నారు. నాతవరం మండలం గన్నవరం గ్రామంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్ స్కిడ్ అయినట్టు నటించి.. సహాయం చేసిన వ్యక్తి జేబులో నుంచే మొబైల్ కొట్టేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం.. నాతవరం పీఎస్ పరిధిలో గన్నవరం గ్రామానికి చెందిన పెట్ల సత్యనారాయణ అనే రైతు రోడ్డు మీద వెళుతున్నాడు. ఆయన చొక్కా జేబులో స్మార్ట్ ఫోన్‌ను చూసిన గుర్తుతెలియని వ్యక్తి అతని ముందుకు వచ్చి బైక్ స్కిడ్ అయినట్టు నటించాడు. ఒక వైపునకు వాలిన బైక్‌ను తేల్చలేనట్టుగా నటించాడు. ఇంతలో పక్కనే ఉన్న రైతు పెట్ల సత్యనారాయణ సహాయం చేశాడు. అక్కడే సమీపంలో మరో వ్యక్తి బైక్ ఆపి సహాయం చేసినట్టుగా వచ్చి..సత్యనారాయణ జేబులో స్మార్ ఫోన్ దొంగిలించాడు. ఇది గమనించని బాధితుడు వాళ్లు వెళ్లిపోయిన తర్వాత తన జేబులో చూసుకుంటే మొబైల్ లేదు. ఎక్కడైనా పడిపోయిందా.? అని సమీపంలో వెతకసాగాడు. అప్పటికే బైక్ మీద వచ్చిన దొంగలు పరారైపోయారు. కొద్ది నిమిషాల వరకూ వెతకడం ప్రారంభించిన బాధితుడు..వాళ్లకు సహాయం చేసినప్పుడే పోయిందని గ్రహించి చేసేదేమీ లేక స్నేహితుడి సహాయంతో 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ



చినరెల్లంగిపాడులో బెన్నమ్మకు పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్



దారెలలో పింఛన్ పంపిణీ చేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, వలంటీర్

రాజవొమ్మంగి: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ గురువారం వేకువ జామునే మొదలైంది. మండలంలో 6,440 మంది పింఛనుదారులకు కోటి 75 లక్షల 89 వేలు రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. సాయంత్రానికి 3,283 మందికి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారన్నారు. 50.98 శాతం పంపిణీ పూర్తయ్యిందన్నారు. శుక్రవారం నాటికి పింఛన్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేస్తామన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో మొదటి రోజే ముమ్మరంగా పింఛన్ పంపిణీ జరిగింది. గురువారం తెల్లవారుజము నుంచే వలంటీర్లు పింఛన్‌దారుల ఇంటి తలుపులు తట్టి పింఛన్ నగదు అందించారు.పింఛన్‌దారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ బట్వాడా చేశారు. కొంత మంది వృద్ధులు, వితంతువులు పొలం పనులకు వెళ్లిపోవడంతో వలంటీర్లు పొలాల గట్ల వద్దకు, కొండ ప్రాంతాల వద్దకు వెళ్లి పింఛన్ బట్వాడా చేశారు. దారెల పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ నేతలు, వలంటీర్లతో కలిసి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

దోమతెరలతో మలేరియా నివారణ

ముంచంగిపుట్టు: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రమేష్ తెలిపారు. కిలగాడ పీహెచ్‌సీలో గురువారం వైద్య సిబ్బంది మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ మలేరియా నివారణ కోసం గ్రామాల్లో గిరిజనులు వైద్య సిబ్బంది సూచనలు తప్పకుండా పాటించాలని, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారిన పడకుండా ఉండాలన్నారు. నిత్యం గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, రానున్న ఎపిడిమిక్ సీజన్‌లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శిరీష, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు వేదవతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నాడు - నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు - నేడు పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సీతయ్య తెలిపారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గొందిపాకలు పంచాయతీలో నాడు - నేడు కింద చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లతో మాట్లాడారు. నాడు - నేడు పాఠశాలల నిర్మాణాల్లో జాప్యం తగదన్నారు. దీనిపై కలెక్టర్ తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి సమీక్షిస్తున్నారన్నారు. పనుల్లో నాణ్యత లోపించినా అక్రమాలకు పాల్పడినా సంబంధిత ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ సహాయకులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గొందిపాకల పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నాడు -నేడు పనులను వేగవంతం చేయాలి

గంగవరం: మండలంలో నాడు-నేడు పనులను వేగవంతం చేయడంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో నాడు-నేడు పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడులో భాగంగా మండలంలోని 15 పాఠశాలల్లో రూ. 4.56 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. వీటిలోని పది పాఠశాలల్లో నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. పాఠశాల భవనాల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుద్దీకరణ, తదితర అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఇవి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. శుక్రవారంలోగా విద్యుద్దీకరణ, మైనర్ రిపేర్లు పూర్తి చేయాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నాడు-నేడు పనులు అమలులో తీసుకోవాల్సిన చర్యలను సాంకేతిక సమస్యలను జేఈ వెంకటేశ్వరరావు, వెలుగు ఏపీఎం జేమ్స్ వివరించారు.

పొలం పనుల్లో రైతుల బిజీ



పొలాన్ని సిద్ధం చేసే పనిలో రైతులు

రాజవొమ్మంగి: తొలకరి సమీపిస్తున్న తరుణంలో మన్యం వ్యాప్తంగా రైతాంగం పొలం పనుల్లో బిజీ అయింది. ముఖ్యంగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో రైతుల్లో జోష్ మొదలయ్యింది. గాలివానలకు పడిపోయిన చెట్లు, బలిగెలు (తాటి చెట్టుపై నుంచి పడిపోయిన ఎండు కొమ్మలు) పిచ్చిమొక్కలు తొలగించి దుక్కులు దున్నుకునేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్లు, నాగళ్లు ఉపయోగించి పొలాన్ని మెత్తగా దున్నుతున్నారు. మరోవైపు సాగుకు అనువుగా మడికట్టు నేలను చదును చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఇరుగు పొరుగు రైతులంతా ఒకరికొకరు సహకరిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. పాడైన గట్లను తిరిగి రూపొందిస్తున్నారు. పశువుల ఎరువులను ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై పొలాలకు తరలించే పనిలో తలమునకలై ఉన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామివారిని దర్శించుకున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: గవరపాలెం కామాక్షీ అమ్మవారి దేవాలయలో గురువారం విగ్రహ దాతలు పొన్నాడ సుందరయ్య, మల్లేశ్వరి, వెంకటసత్య, నరసింహాచారి, వెంకటరత్నం, వేణు, బ్రహ్మాజీ, సునీత దంపతుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ అర్చకులు బొల్లాప్రగడ గణపతిశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జాము 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేసి ఉదయం 8.08 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. స్వామిని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, కొణతాల భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, భక్తులు పాల్గొన్నారు.